
గిద్దలూరు ఎస్వీ కళాశాలలో ఓటు వేసేందుకు క్యూలో బారులుదీరిన ఓటర్లు

ఓటెత్తిన చైతన్యం

- సోమవారం వేకువ జాము నుంచే ఎన్నికల సందడి
- పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరిన మహిళలు, వృద్ధులు
- చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- కడపటి సమాచారం అందేవరకు మార్కాపురం నియోజకవర్గంలో 84.08 శాతం, గిద్దలూరులో 81.85 శాతం పోలింగ్ నమోదు

మార్కాపురం/మార్కాపురం టౌన్/మార్కాపురం రూరల్/తర్లుపాడు/కొనకనమిట్ల/పొదిలి/బేస్తవారిపేట/కంభం/గిద్దలూరు రూరల్/రాచర్ల/కొమరోలు:

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 6.30 గంటల నుంచే ఓటర్లు క్యూ కట్టడంతో పోలింగ్ కేంద్రాలు జాతరను తలపించాయి. మండుటెండను సైతం లెక్క చేయకుండా మహిళలు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు వేసేందుకు యువత ఆసక్తి చూపారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పోలింగ్ తమకు అనుకూలంగా లేదని భావించిన టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. పలు చోట్ల వాగ్వివాదానికి దిగి, ఘర్షణ వాతావరణం సృష్టించారు. పోలీసులపైనా దాడులు చేసేందుకు టీడీపీ శ్రేణులు వెనుకాడలేదు. ఓటింగ్‌ను తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న టీడీపీ నేతల ఎత్తుగడలు బెడిసికొట్టాయి. పోలింగ్ సజావుగా సాగేలా ఎన్నికల పర్యవేక్షకులతోపాటు పోలీసులు చర్యలు చేపట్టారు. మార్కాపురం నియోజకవర్గంలో పోలింగ్ సరళిని ట్రైనీ ఐపీఎస్‌లతో కలిసి సబ్ కలెక్టర్ రాహుల్ మీనా పర్యవేక్షించారు. తన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజీని పరిశీలిస్తూ ఎప్పటికపుడు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. గిద్దలూరు పట్టణంలో 179, 180, 185 నుంచి 189వ పోలింగ్ బూత్‌లలో ఎన్నికల ప్రక్రియను వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి పరిశీలించారు. మార్కాపురం పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు పర్యవేక్షించారు.


మార్కాపురం 79వ బూత్‌లో టీడీపీ దొంగ ఓట్లపై పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


గిద్దలూరు టౌన్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ

ఓటేసిన ప్రముఖులు

- మార్కాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు తొలిసారి తన ఓటు తనకే వేసుకున్నారు. పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని 80వ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు దఫాలుగా ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ మార్కాపురంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, ఆయన సతీమణి కల్పనారెడ్డితో కలిసి మార్కాపురంలోని ఎస్సీబీసీ కాలనీ మున్సిపల్ స్కూల్లో, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి వేములకోటలో ఓటు వేశారు. మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ అలీబేగ్, గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సిరివెళ్ల ప్రసాద్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


ఓటు వేసి సిరా చూపుతున్న మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ దంపతులు


ఓటు వేసి వస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి


మార్కాపురం : పోలింగ్ బూత్ వద్ద మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి


ఓటు వేసిన షంషేర్ అలీబేగ్

గొట్లగట్టు పోలింగ్ బూత్‌లో పీఓ ఓవరాక్షన్

కొనకనమిట్ల మండలం గొట్లగట్టు 179వ పోలింగ్ బూత్‌లో వృద్ధుల వెంట వచ్చిన సహాయకులను పోలింగ్ అధికారులు అనుమతించేందుకు నిరాకరించారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు ఎలాంటి అభ్యంతరం తెలియజేయకపోయినా పోలింగ్ అధికారులు వ్యవహరించిన తీరుపై వృద్ధులతోపాటు ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సహాయకులను పంపవద్దని ఎమ్మార్వో చెప్పాడంటూ ప్రిసైడింగ్ ఆఫీసర్ అడ్డదిడ్డంగా సమాధానం చెప్పారు. సహాయకులను అనుమతించకపోగా బ్లూ బటన్ నొక్కు అంటూ వృద్ధులకు ఉచిత సలహా ఇవ్వడంతో పీఓనా టీడీపీ ఏజెంటా అంటూ స్థానికులు మండిపడ్డారు.

ఉద్యోగులా.. టీడీపీ నాయకులా?


దరిమడుగు బూత్‌లో టీడీపీ ఏజెంట్ అవతారమెత్తిన కంప్యూటర్ ఆపరేటర్ రామిరెడ్డి


రాచర్లలో టీడీపీ తరఫున ఓట్లు అభ్యర్థిస్తున్న ఆర్టీసీ కండక్టర్ శంకర్‌నాయుడు

- గిద్దలూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలింగ్ బూత్ 207లో ఆర్టీసీ డ్రైవర్ పాలుగుళ్ల రంగారెడ్డి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి టీడీపీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెట్టాడు.
- రాచర్లలోని పోలింగ్ కేంద్రం వద్ద ఆర్టీసీ కండక్టర్ ఉలాపు శంకర్ నాయుడు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి టీడీపీకి మద్దతుగా ఓటర్లను ప్రలోభపెడుతూ, బెదిరింపులకు పాల్పడ్డాడు.
- మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రామిరెడ్డి దరిమడుగు పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరాడు. దీనిపై ఎంపీడీఓకు వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో అక్కడి నుంచి జారుకున్నాడు.


టీడీపీకి ఓటు వేయాలని మహిళలను ప్రలోభపెడుతున్న ఆర్టీసీ డ్రైవర్ రంగారెడ్డి

సతాయించిన ఈవీఎంలు

మార్కాపురం నియోజకవర్గంలో..

- నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం 9 గంటలకు 5.73 శాతం, 11 గంటలకు 20.45 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 42.10 శాతం, 3 గంటలకు 52.91 శాతం, 4 గంటలకు 61.88 శాతం, 6 గంటలకు 75.51 శాతం పోలింగ్ నమోదైంది.
- మార్కాపురం మండలం వేములకోటలో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది.
- తర్లుపాడు మండలం కొండారెడ్డిపల్లి 122వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటపాటు పోలింగ్ నిలిచింది.
- తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో 6 బూత్‌లు ఉండగా 4 బూత్‌ల్లో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- కొనకనమిట్ల జెడ్పీ హైస్కూల్లోని 165వ పోలింగ్ బూత్‌లో ఉదయం 7.50 నుంచి సాయంత్రం వరకు 5 పర్యాయాలు ఈవీఎం మొరాయించింది. దీంతో ఓటర్లు క్యూలో నిల్చోలేక అసహనానికి గురయ్యారు. మధ్యాహ్నం 3 తర్వాత గంటపాటు పోలింగ్ నిలిచింది. అలాగే సిద్ధవరం బూత్ 168లోనూ ఈవీఎం మొరాయించడంతో ఉదయం 11 నుంచి గంటపాటు పోలింగ్ నిలిచింది.

గిద్దలూరు నియోజకవర్గంలో..

- నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 9.57 శాతం, 11 గంటలకు 24.21 శాతం, ఒంటి గంటకు 40.54 శాతం, 3 గంటలకు 52.85 శాతం, 4 గంటలకు 61 శాతం, ఆరు గంటలకు 74 శాతం, 8 గంటలకు 78.10 శాతం పోలింగ్ నమోదైంది. ఈవీఎం సక్రమంగా పనిచేయకపోవడంతో పలు చోట్ల పోలింగ్ మందకొడిగా సాగింది.
- కంభం మండలంలోని సూరేపల్లిలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- గిద్దలూరు మండలంలోని కొంగలవీడులో పోలింగ్ బూత్ 218లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.
- బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్లోని బూత్ నం.85లో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అలాగే చెట్టిచెర్ల గ్రామంలో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంతో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.
- గిద్దలూరు మండలం నరవ గ్రామంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ఈవీఎంలు మొరాయించడంలో ఓటర్లు వెనుదిరిగారు. 45 నిమిషాల అనంతరం పోలింగ్ ప్రారంభమైంది.
- గిద్దలూరు మండలం తిమ్మాపురం గ్రామంలో పోలింగ్ నిదానంగా సాగుతుండటంతో ఓటర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. క్యూలో ఉన్న సుమారు 100 మంది మహిళలు ఎండలో గంటలపాటు నిల్చోలేక ఎన్నికల సిబ్బంది, బందెబస్తులో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఓ దశలో తోపులాట చోటుచేసుకుంది.
- అర్ధవీడు మండలం గన్నిపల్లెలో ఈవీఎంలు మొరాయించడంలో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.


కొనకనమిట్ల బూత్ 165లో పోలింగ్ నిలిచిపోవడంతో వేచి ఉన్న ఓటర్లు


కంభంలో ఓటు వేసేందుకు బూత్ వద్దకు వెళ్తున్న ఓ అవ్వ


మార్కాపురం : కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, ట్రైనీ ఐపీఎస్‌లు


కొనకనమిట్ల : పాతపాడు గ్రామంలో బారులుతీరిన ఓటర్లు


కొనకనమిట్లలో భారీగా వేచి ఉన్న ఓటర్లు


అర్ధవీడు మండలం పాపినేనిపల్లిలో క్యూలో నిల్చున్న మహిళలు


బేస్తవారిపేటలో ఓటు వేసి వస్తున్న దివ్యాంగుడు

పచ్చ మూకల్లో కట్టలు తెగిన అసహనం


మార్కాపురంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన మణి


మార్కాపురం : చింతగుంట్ల బూత్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ బాలసుందరరావు

ఓటర్లు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గుచూపుతున్నారని గ్రహించిన టీడీపీ నేతలు అసహనంతో రగిలిపోయారు. ఓటమి భయంతో పోలింగ్ కేంద్రాల వద్ద రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీ నేతలు, ఏజెంట్లతోపాటు పోలీసులపైనా దాడులకు బరితెగించారు.

- మార్కాపురం పట్టణంలోని పోలింగ్ కేంద్రం 79లో దొంగ ఓటు వేస్తున్న ఓటర్లను వైఎస్సార్ సీపీ ఏజెంట్లు అడ్డుకోవడంతో టీడీపీ ఏజెంట్లు దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులతో మాట్లాడారు.
- మార్కాపురం మండలం చింతగుంట్ల, ఇడుపూరు, మిట్టమీదపల్లి, మాల్యవంతునిపాడులో టీడీపీ ఏజెంట్లు, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దౌర్జన్యానికి దిగారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పోలింగ్ సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.
- మార్కాపురం మండలం చింతగుంట్లలో టీడీపీ నేతల తీరుతో వివాదం తలెత్తడంతో డీఎస్పీ బాలసుందరరావు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేశ్వరనాయక్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.
- మార్కాపురం పట్టణంలోని 41వ పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా కూర్చున్న ఆర్యవైశ్య నాయకుడు కామిశెట్టి సురేష్‌తో టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగి బూతులతో రెచ్చగొట్టారు. తన తండ్రిని ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించిన కామిశెట్టి మణి చెంప మీద టీడీపీ నాయకుడు చంటి నోటితో కొరికి గాయపరిచాడు.
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఇచ్చిన ఆదేశాల మేరకు తర్లుపాడు మండలం బుడ్డపల్లిలోని పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులను పరిశీలించి బయటకు వస్తున్న సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు, కేతగుడిపి సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్‌పై టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారు. నీకేం పని ఇక్కడికి ఎందుకొచ్చావంటూ ఐదుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు.

గిద్దలూరు నియోజకవర్గంలోనూ బరితెగింపు

- గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి బావమరిది సురేష్‌రెడ్డి పోలింగ్ బూత్‌ల్లోకి చొరబడి ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నించడంపై పోలీసులకు వైఎస్సార్ సీపీ నేతలు ఫిర్యాదు చేశారు.
- గిద్దలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోని పోలింగ్ బూత్ 205లో వృద్ధులను టీడీపీ నేతలు ప్రలోభాలకు గురిచేశారు. వృద్ధుల ఓట్లనే టీడీపీ శ్రేణులే వేసేందుకు యత్నించారు.
- గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు ఎస్సీ కాలనీ పోలింగ్ బూత్ 225 వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు దాడికి యత్నించారు. టీడీపీకి చెందిన వైస్ సర్పంచ్ శేషగిరిరావు తమ్ముడు ఓటు వేసిన అనంతరం పదే పదే పోలింగ్ బూత్‌లోకి వస్తుండటంతో వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు అభ్యంతరం తెలిపారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు.
- కంభం మండలంలోని హజరత్‌గూడెంలో తల్లితో ఓటు వేయించేందుకు సహాయంగా వెళ్లిన వ్యక్తిని టీడీపీ ఏజెంట్లు అడ్డుకుని వైఎస్సార్ సీపీ ఏజెంట్‌పై ఘర్షణకు దిగారు.
- బేస్తవారిపేట మండలం పాపాయిపల్లెలో పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.
- రాచర్ల మండలంలోని అనుములవీడు గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు బహిరంగా డబ్బు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేశారు.
- కంభం మండలం లింగోజీపల్లెలో దొంగ ఓటు వేసేందుకు యత్నించిన మహిళను వైఎస్సార్ సీపీ ఏజెంట్ అడ్డుకోవడంతో అక్కడే ఉన్న కానిస్టేబుల్ ఆమెను బయటకు వెళ్లమని హెచ్చరించాడు. దీంతో కానిస్టేబుల్‌పై టీడీపీ నాయకులు గొడవకు దిగారు.


రాచర్ల: అనుములవీడులో డబ్బు పంచుతున్న టీడీపీ నాయకులు


కంభం : లింగోజిపల్లెలో కానిస్టేబుల్‌ను బెదిరిస్తూ..


బేస్తవారిపేటలోని జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద..


మార్కాపురంలోని సాధన కాలేజీ బూత్..


కంభం 38, 39 పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూ..


కొమరోలు : తాటిచెర్లలో ఉదయం 7 గంటలకే భారీ క్యూ


మార్కాపురం మండలం చింతగుంట్ల పోలింగ్ కేంద్రం వద్ద..


తర్లుపాడులో ఉదయం వేళ ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలు